క్లుప్తంగా

ఏఓగా బాధ్యతల స్వీకరణ



అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నూతన ఏఓగా శివరాం ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో ఆయన విధుల్లో చేరి ఏడీఏ అఫ్జల్ బేగంకు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. కాగా, చర్ల మండల ఏవోగా పని చేస్తూ, తాజాగా జరిగిన బదిలీల్లో అశ్వారావుపేటకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించే ఏవో వై.నవీన్‌కు ఖమ్మం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ సాంకేతిక విభాగానికి బదిలీపై వెళ్లారు. మరోవైపు, దమ్మపేటలో ఏఈఓగా పనిచేస్తున్న నార్లపాటి రవీంద్ర తిరుమలకుంట ఏఈఓగా బదిలీపై వచ్చారు.

పీకేఓసీ సంక్షేమ అధికారిగా ఓంకారిబాబు



మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పీకేఓసీ సంక్షేమ అధికారిగా ఓంకారిబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఓంకారిబాబును కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, సిబ్బంది ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఐఎన్‌టీయూసీ నాయకులు వి.కృష్ణంరాజు, మల్లికార్జున్, సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్‌డీ.నాసర్‌పాషా, సారయ్య, ఎండీ.అహ్మద్, ప్రాజెక్ట్ కార్యాలయ సిబ్బంది మధు, డీవై సూపరింటెండెంట్ జి.సురేష్, సీనియర్ అసిస్టెంట్ శిల్ప పాల్గొన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా రాధా రుక్మిణి



అశ్వారావుపేట: అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రి సూరింటెండెంట్‌గా డాక్టర్ రాధా రుక్మిణి శనివారం విధుల్లో చేరారు. గతంలో ఇదే ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై గైనకాలజిస్ట్‌గా పనిచేసిన రాధారుక్మిణిని.. ఇక్కడికే బదిలీ చేయడంతో విధుల్లో చేరారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉన్నదని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బదిలీ చేసినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దృష్టి సారించండి

మణుగూరుటౌన్: పైప్‌లైన్ పగిలి రెండు రోజులుగా పీవీకాలనీ వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఫిల్టర్ బెడ్‌కు మరమ్మతులు చేయాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి అన్నారు. శనివారం ఆయన ఫిల్టర్ బెడ్ సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడుతూ.. కాలనీ ఏరియాలో 4.5 గ్యాలన్ నీటి నిల్వ చేసే సామర్థ్యం ఉన్న ట్యాంక్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, వాటి పరిధి పెంచి పాత ఫిల్టర్ బెడ్ మరమ్మతులు నిర్వహించితే నీటి సమస్య తీరుతుందని అన్నారు. ఆ దిశగా యాజమాన్యం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ చేయాలి

ములకలపల్లి: అర్హులైన రైతులందరికీ తక్షణమే రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని తెలంగాణా రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవి డిమాండ్ చేశారు. గడ్డం వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్న, చిన్నకారు రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో రకరకాల కొర్రీలు పెడుతూ కొందరికే మాఫీ చేయడం సరికాదని అన్నారు. గోపగాని లక్ష్మీనర్సు, ఎనిగండ్ల అంజయ్య, కీసరి గంగరాజు, కణితి నాగేశ్వరరావు, శ్రీరాములు, వినోద్, శ్రీదేవి, హేమాని పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

పినపాక: మండల పరిధిలోని సుందరయ్యనగర్, టి.కొత్తగూడెం గ్రామాల్లోని విద్యార్థులకు యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో శనివారం నాడు దుస్తులు, బ్యాగులు, నోట్ పుస్తకాలు, పలకలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ పినపాక మండలాధ్యక్షుడు ధూళిపూడి శివప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా కోఆర్డినేటర్ పాలాస మల్లికార్జున్, పోడుల రాజు, హర్షవర్ధన్ ,అవినాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి


చర్ల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మిషన్ భగీరథ పథకం కార్మికుడు మద్దిబోయిన సంతోష్‌కుమార్ కుటుంబంలో ఒకరికి పథకంలోనే పని కల్పించి న్యాయం చేయాలని కోరుతూ శనివారం చర్లలో సూపర్ వైజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి కొండా కౌషిక్ మాట్లాడారు. పథకం సిబ్బంది, ఐఎఫ్‌టీయూ నాయకులు రెడ్డి మోహన్, సుందర్, సురేష్, వినయ్, రాజేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

అశ్వాపురం: నెల్లిపాక గ్రామానికి చెందిన చావా రజిని, రామచంద్రాపురం గ్రామానికి చెందిన యర్రా నర్సిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందగా.. వారి మృతదేహాలకు డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, నాయకులు ముత్తినేని వాసు, కమటం నరేష్, వీరమాచనేని రాజశేఖర్, బిక్కసాని సత్యనారాయణ, మోగిళ్ల పెదవీరారెడ్డి, ఏకాంబరం, కొడాలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాఖీ.. సందడే సందడి!

- విస్తృతంగా స్టాళ్ల ఏర్పాటు
- ఆకట్టుకుంటున్న విభిన్న రాఖీలు
- కొనుగోళ్లతో మార్కెట్‌లో హడావుడి



రాఖీలను కొనుగోలు చేస్తున్న ప్రజలు



జైపూర్ స్టోన్ రాఖీలు

సండే స్పెషల్

భద్రాచలంటౌన్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకైన రాఖీ పండుగను ప్రతి ఏటా శ్రావణ పౌర్ణమి రోజున అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి మురిసిపోతారు. సోదరుడు దీర్ఘాయుష్షుతో జీవించాలని మనస్ఫూర్తిగా దీవిస్తూ.. తమ అనురాగాన్ని వ్యక్తపరుస్తారు. జీవితాంతం సోదరీమణులకు రక్షగా నిలవాలని సోదరులు భావిస్తారు. తమ ఆత్మీయ అనుబంధం ఎల్లప్పుడు దృఢంగా ఉండాలని రాఖీ పండుగను జరుపుకుంటారు. ఈ నెల 19న రాఖీ పండుగ సందర్భంగా మార్కెట్‌లో వివిధ రకాల రాఖీలను విక్రయదారులు అందుబాటులోకి తీసుకొచ్చారు.

ప్రత్యేక స్టాళ్లు..

భద్రాచలం పట్టణంలో పలుచోట్ల రాఖీల విక్రయాలకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ రాఖీల ధరలు రూ.10 నుంచి రూ.600 వరకు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్లో డిమాండ్‌ను అనుసరించి వ్యాపారులు పలు భిన్నమైన రాఖీలను అందుబాటులో ఉంచారు. చుట్ట ప్రక్కల గ్రామీణ ప్రాతాల నుంచి ప్రజలు రాఖీల కొనుగోలుకు తరలిరావడంతో రాఖీ స్టాళ్ల వద్ద సందడి వాతావరణం కనిపిస్తోంది.

ఆకట్టుకుంటున్న స్టోన్ రాఖీలు

మారుతున్న కాలంతో పాటు రాఖీలు సైతం పలు విభిన్నమైన డిజైన్లలో ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా యువతులను ఆకర్షించే విధంగా రాఖీలు మార్కెట్‌లో అభ్యమవుతున్నాయి. ఇందులో జైపూర్ స్టోన్ రాఖీల వైపే అందిరి చూపు వెళ్తుంది. వీటితో పాటు ముత్యాలు, రుద్రాక్ష, తక్కువ నాణ్యత గల వజ్రాలు పొదిగిన రాఖీలు, బంగారు పూత రాఖీలు, తమలపాకు రాఖీలు ఉన్నాయి.



తమలపాకు రూపంలో ఏర్పాటు చేసిన రాఖీ, పసుపు, కుంకుమ

చిన్న పిల్లలను ఆకట్టుకునేలా నెమలి ఈకెల రాఖీలతో పాటు చోటా భీమ్, మిక్కీ మౌస్, యాంగ్రీ బర్డ్ వంటి బొమ్మలతో కూడిన రాఖీలు సైతం వ్యాపారులు విక్రయానికి ఉంచారు.

20న ఇసుక వేలం

ములకలపల్లి: ఈనెల 20 వ తేదీన బహిరంగ ఇసుక వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గుడ్ల పుల్లారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలపరిధిలోని సంజీవ్‌పల్లి గ్రామానికి చెందిన లకావత్ రాంబాబు ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 8 ట్రాక్టర్ ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన విషయం విధితమే. సీజ్ చేసిన ఇసుకను 20వ తేదీ 11.30 గంటలకు స్థానిక తహసీల్ వద్ద వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ తెగలకు చెందిన వారు మాత్రమే వేలంపాటలో పాల్గొనే అవకాశం ఉంటుదని తెలిపారు.

అన్‌ఫిట్ ఉత్తర్వులపై హర్షం

మణుగూరుటౌన్: అనారోగ్య కారణాలతో విధులు చేయలేక ఇబ్బందులు పడుతున్న కార్మికులకు అన్‌ఫిట్ ఉత్తర్వులు జారీ చేసిన సీఅండ్ఎండీ బలరాంనాయక్‌కు ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డీ నాజర్‌పాషా ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చొరువ చూపిన ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీపతిగౌడ్, గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులు అలసత్వం వీడాలి



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

గుండాల: జిల్లాలోని అత్యంత మారుమూల ప్రాంతమైన ఆళ్లపల్లి మండలంలో అభివృద్ధి జరగాలంటే అధికారులు అలసత్వం విడనాడి పనులపై దృష్టి సారించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన ఆళ్లపల్లి మండలంలో పర్యటించారు. రైతు వేదిక నందు 17 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. అనంతరం ఆళ్లపల్లి, అనంతోగు, రాయిపాడు పంచాయతీ కేంద్రాల్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధిపై తప్పుడు నివేదికలు ఇచ్చిన వ్యవసాయ శాఖ, మండల పరిషత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీరు, సాగునీరు, విద్యా, వైద్యం, అంగన్‌వాడీ, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో స్థానిక సమస్యలపై చర్చించారు. కరెంటుకు అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత విద్యుత్ శాఖ ఏఈని ఆదేశించారు. అన్ని శాఖలకు సంబంధించి భవనాలు నిర్మించేందుకు మండల కేంద్రంలో స్థలం చూడాలని తహసీల్దార్ శకుంతలను సూచించారు. అంగన్‌వాడీ భవనాలకు స్థలాలు చూడాలని, ఆయా కేంద్రాల్లో మంచినీటి సదుపాయం కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఇటీవల పూర్తయిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శకుంతల, ఎంపీడీఓ శ్రీను, ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంపీఓ శ్రీనివాసరావు, టేకులపల్లి సీఐ సురేష్, ఎస్సై రతీష్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి

అశ్వారావుపేటరూరల్: ఓ రిటైర్డ్ ఆర్మీ జవాన్ శనివారం మృతి చెందిన ఘటన అశ్వారావుపేటలో జరిగింది. స్థానిక పోస్టు ఆఫీస్ బజారుకు చెందిన మాజీ రిటైర్డ్ ఆర్మీ జవాన్(హవాల్దర్ క్యాడర్) రామిశెట్టి వీర్రాజు(90) వయోభారంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక బీజేపీ నాయకులు బండారు చందు ఆధ్వర్యంలో వీర్రాజు భౌతిక కాయంపై జాతీయ జెండా కప్పారు. అదే విధంగా పలువురు వీర్రాజు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బాధ్యులు చవ్వా రమేష్, జల్లిపల్లి అరవింద్, జి.అప్పారావు, మణికంఠ, శివ కుమార్, చైతన్య, అక్షయ్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఏటీడీఓ



రికార్డులను పరిశీలిస్తున్న ఏటీడీఓ అశోక్

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను ఏటీడీఓ అశోక్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలోని తరగతి గదులు, వసతి గదులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి ఎఫ్ఏ-1 మార్కుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌యం సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

పినపాక: ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాదిగ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవంగి వెంకటరమణ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో నియోజకవర్గ కన్వీనర్ శ్రీను అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ.. 12శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో ఎన్నో ధర్నా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. శ్రీను, కొప్పుల వెంకన్న, సమ్మయ్య పాల్గొన్నారు.

శాంతిభద్రతల రక్షణలో కఠినంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: శాంతి భద్రతలను కాపాడే విషయంలో కఠినంగా ఉండాలని, సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు రాకుండా చూడాలని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కేసులు, నమోదైన కేసుల రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ పక్కన ఉన్న సీఐ, ఎస్సై క్వాటర్స్, జంగారెడ్డిగూడెం మార్గంలో ఉన్న సిబ్బంది క్వాటర్స్‌తోపాటు సరిహద్దు చెక్‌పోస్టు పరిశీలించారు. డీఎస్పీతోపాటు అశ్వారావుపేట సీఐ కరుణాకర్, ఎస్సై శివరామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

రక్షాబంధన్ వేడుకలు

మణుగూరురూరల్: మున్సిపాలిటీలోని పైలట్‌కాలనీలో గల ఎక్స్‌లెంట్ హైస్కూల్‌లో శనివారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎండి.ఖాదర్, చైర్మన్ యూసుఫ్ షరీఫ్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ తదితరులు

బూర్గంపాడు: మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన పలువురు ఉద్యోగులను శనివారం తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డిలు ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ ఏఈగా పనిచేసి భద్రాచలం పంచాయతీరాజ్ డీఈగా ఉద్యోగోన్నతి పొందిన వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన విజయలక్ష్మిని, అటెండర్ నాగేశ్వరరావును, ఉద్యోగ విరమణ పొందిన బోర్ మెకానిక్ గుణపాటి వెంకటరెడ్డిని కూడా ఈ సందర్భంగా ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ సునీల్‌శర్మ, సూపరింటెండెంట్ రవీందర్, రఘుకుమార్, మాధవి, విజయలక్ష్మి, వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఎమ్మెల్యే తనిఖీ



చికిత్సకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రిని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉన్న విషయం పలు పత్రికల్లో తరచూ ప్రచురితం కావడంతో ఆయన స్పందించి ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై రోగులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్‌లకు అసౌకర్యాలు కలుగకుండా సేవలందించాలని వైద్యులను ఆదేశించారు. ఏరియా ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తానని, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్‌ను సంప్రదిస్తానని సిబ్బందికి హామీ ఇచ్చారు. ఇప్పుడున్న సిబ్బంది డిప్యూటేషన్లు రద్దు చేసుకుని ఇక్కడే సేవ చేయాలని సూచించారు. ఆస్పత్రిలో శానిటైజేషన్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య కోసం రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. ఆస్పత్రికి ఏవిధమైన అవసరాలున్నాయో లిఖిత పూర్వకంగా తనకు అందజేస్తే మంత్రులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం ఆస్పత్రిలో నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి, డాక్టర్ సాయికిరణ్ ఉన్నారు.

చెక్కుల పంపిణీ..

మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. శనివారం మండలంలోని 28మంది కల్యాణలక్ష్మి లబ్దిదారులు, 26 సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు.

ఆసుపాకలో పర్యటన..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక గ్రామంలో శనివారం అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. గ్రామానికి చెందిన బిర్రం పుల్లారావు ఇటీవలె అనారోగ్యంతో మృతి చెందగా.. దశదిన కార్యక్రమానికి హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి చెందిన గుగులోతు వెంకటమంగ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకొని ఆమెను పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం సాయం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కునసోతు లింగయ్య, పసుపులేటి రాము, కరీం పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని మహిళలు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. పట్టణంలోని గ్రేస్ గాస్పెల్ చర్చిలో శనివారం సికింద్రాబాద్ సౌత్ లాలాగూడ బాప్టిస్ట్ చర్చివారి ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్న 17 మంది కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళలకు మిషన్లు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. శిక్షణ పొందిన మహిళలకు ప్రభుత్వం తరుపున పాఠశాలలకు యూనిఫామ్స్ కుట్టే అవకాశాన్ని కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రేస్ గాస్పెల్ చర్చి పాస్టర్ సాల్మన్ రాజ్, బాప్టిస్ట్ చర్చి ప్రెసిడెంట్ వై పురుషోత్తం, సెక్రటరీ జాన్సన్, పీజే ప్రకాశం, విద్యాసాగర్, జడ్సన్, నెల్సన్, రాజ్ కుమార్, సాల్మన్ రాజ్, కామేశ్వరరావు, హేమంత్ కుమార్, ప్రభ, వసంత్ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో అధిక ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చంద్రుగొండ: పాడి పశువుల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చని శ్రీనిధి జిల్లా రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. మహిళాశక్తి పథకంలో భాగంగా చంద్రుగొండలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం మహిళా సంఘాలతో ఆయన సమావేశమయ్యారు. పెరటి కోళ్ల పెంపకం, డైరీ ఫాం లబ్ధిదారులతో రైతులకు, మహిళలకు ఆయన అవగాహన కల్పించారు. జిల్లాకు 500 పాడి పశువుల యూనిట్లు, 2,750 పెరటి కోళ్ల యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. పాడి పశువుల పథకంలో ఒక్కో పాడిగేదెకు రూ.93,250, 50 పెరటి కోళ్ల యూనిట్‌కు రూ.12,500, 100 పెరటి కోళ్ల యూనిట్‌కు రూ.23 వేలు ఇస్తామని తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా చేపల విక్రయానికి వాహనాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. రాయితీలపై ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ డీపీఎం సునందన్, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఏపీఎం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్యురాలి హత్యకు నిరసన

కోల్‌కత్తాలోని ట్రైనీ వైద్యురాలి అత్యాచారం, హత్యకు నిరసనగా పలుచోట్ల ప్రభుత్వాస్పత్రుల సిబ్బంది శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీలు చేపట్టి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, మెడికల్ సూపరింటెండెంట్‌లు మాట్లాడుతూ.. వైద్యులు, వైద్య సిబ్బందిపై జరుగుతున్న దాడులపై ఓ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కటుంబానికి గౌరవప్రదమైన పరిహారం ఇవ్వాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేట: కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న జవహర్ విద్యార్థులు



దుమ్ముగూడెం: నర్సాపురం పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య, సిబ్బంది నిరసన



అన్నపురెడ్డిపల్లి: నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది



భద్రాచలంఅర్బన్: అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న వైద్య బృందం



బూర్గంపాడు: మోరంపల్లిబంజరలో వైద్యుల నిరసన ర్యాలీ



భద్రాచలంఅర్బన్: భావోద్వేగంతో మాట్లాడుతున్న డాక్టర్ సరోజిని



మణుగూరురూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ..



మణుగూరుటౌన్: నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న సింగరేణి వైద్యులు



కరకగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి మధు, సిబ్బంది



చర్ల: కొయ్యూరులో నిరసన తెలియజేస్తున్న వైద్యులు, సిబ్బంది